క్లుప్తంగా

ప్రభుత్వ భూములను రక్షించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న గుట్రాజ్‌పల్లి గ్రామస్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని గుట్రాజ్‌పల్లిలో ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమిస్తున్నారని, ప్రభుత్వ భూములను కాపాడాలని సోమవారం గ్రామస్తులు మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని వాపోయారు. స్పందించిన జీవన్‌రెడ్డి భూములను తప్పకుండా కాపాడతానని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడడం నా బాధ్యత అని పేర్కొన్నారు. సర్వేయర్‌తో ప్రభుత్వ భూమి హద్దులు నిర్ణయించాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తానన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న మాజీ కమిషనర్


శేషవస్త్రం, ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి వారిని సోమవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ మాజీ కమిషనర్ సుందర్‌కుమార్ కుటుంబ సభ్యులు స్వామివార్లను దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న జగిత్యాల డీఎస్పీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామిని సోమవారం సాయంత్రం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దేవస్థానం పక్షాన స్వాగతం పలికారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.

ఉపాధిహామీలో కోళ్లఫారం నిర్మాణం


కోళ్లఫారం షెడ్డును పరిశీలిస్తున్న పీడీ

పెగడపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా కోళ్ల ఫారం నిర్మాణాలు చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో ఓ రైతు ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన కోళ్ల ఫారం షెడ్డును సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కోళ్ల ఫారాలతోపాటు పాడి గేదెల కు కూడా షెడ్డు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు ఉపయోగపడే పంట కాలువల మరమ్మతులు, కొత్త కాలువల నిర్మాణాల పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి


మాట్లాడుతున్న హెచ్‌ఎం వసంత

కథలాపూర్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సిరికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వసంత కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో సత్తా చాటారని వివరించారు. ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్నభోజనం, యూనిఫామ్స్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణు, మహేందర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని బోర్నపల్లికి చెందిన కొడిపల్లి స్వప్నకు రూ.1.40 లక్షల విలువైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును మాజీమంత్రి జీవన్‌రెడ్డి పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొయ్యడి మహిపాల్‌రెడ్డి,మండల అధ్యక్షుడు కోడిపల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు ఏలేటి జలందర్‌రెడ్డి, బోర్నపల్లి గ్రామ అధ్యక్షుడు ఉప్పు లక్ష్మణ్, రాగుల సత్యం, మల్యాల జలపతిరెడ్డి, మాజీ సర్పంచులు ఉన్నారు.

రోడ్డు అధ్వానం ...


బురదమయమైన కొల్వాయి చిన్న కొల్వాయి రహదారి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి–చిన్నకొల్వాయి గ్రామాల మధ్య తారు రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తడిగా మారింది. తారు రోడ్డుపై గోదావరి నుంచి ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు తరచూ వెళ్తుండడం, రోడ్డు నిర్వాహణ సరిగా లేకపోవడంతో 2.50 కిలోమీటర్ల తారు రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డుపై నీరు నిలిచి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తారు రోడ్డు వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు బీటీ వేయకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. అధికారులు దృష్టిసారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కొల్వాయి–చిన్నకొల్వాయి మధ్య తారు రోడ్డు పరిస్థితి

మరమ్మతు చేశారు..



కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి శివారులో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీపై సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. లీకేజీ అవుతున్న పైప్‌లైన్, వాల్వుకు మరమ్మతు చేశారు.పట్టణాల్లో, గ్రామాల్లో లీకవుతున్న పైప్‌లైన్ల మరమ్మతులు స్థానిక అధికారులే చేపట్టాలని పేర్కొన్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

స్వయం ఉపాధి రుణాలకు పోటీ

- యూనిట్లు 562.. దరఖాస్తులు 2031
- వెల్లువలా దరఖాస్తులు
- ప్రారంభమైన ఇంటర్వ్యూలు


పెగడపల్లిలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పెగడపల్లి: ఉన్నత చదువు చదివి కొలువులు దొరకక యువత స్వయం ఉపాధి వైపు చూస్తోంది. ప్రభుత్వం అందించనున్న కార్పొరేషన్ రుణాలతో ఉపాధి పొందాలని నిరుద్యోగులు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువత, మహిళల స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాస్ పథకం అమలు చేస్తోంది. దీనిలో రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు యూనిట్ల రుణాలు అందించేందుకు నిర్ణయించింది. దరఖాస్తుల ప్రక్రియ పూర్తిచేసిన అధికారులు ఇంటర్వ్యూలు ప్రారంభించారు. దరఖాస్తుదారులు ఇప్పటి నుంచే అధికారంలో ఉన్న పలుకుబడి ఉన్న కాంగ్రెస్ నాయకుల చుట్టూ, ఎంపిక కమిటీలో ఉన్న మండల అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మండలంలో దరఖాస్తులు ఇలా..

అన్ని కార్పొరేషన్లకు సంబంధించి వ్యక్తిగత రుణాలకు దరఖాస్తులు అధిక సంఖ్యలో వచ్చాయి. మండలానికి కేటాయించిన యూనిట్లు 502 అయితే 2031 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు బ్యాంకుల వారిగా కేటాయించారు.

స్వయం ఉపాధి దక్కేనా...

స్వయం ఉపాధి రుణాలు రాజకీయ పలుకుబడి, బ్యాంక్ అధికారుల అండ ఉన్నవారికి మాత్రమే దక్కుతాయనే విమర్శలున్నాయి. రూ. 50 వేల యూనిట్‌కు వంద శాతం, రూ. లక్ష యూనిట్‌కు 90 శాతం, రూ. 2 లక్షల యూనిట్‌కు 80 శాతం, రూ. 3 లక్షల యూనిట్‌కు 80 శాతం, రూ. 4 లక్షల యూనిట్‌కు 70 శాతం రాయితీ ప్రకటించింది. వీటిపై ప్రభుత్వం రాయితీ అధికంగా ఇస్తుండంతో నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.ఎమ్మెల్యే, ఎంపీల నుంచి సిఫార్స్ చేయించి రుణాలు పొందాలని చూస్తున్నారు.

యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకత పాటిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారికి ఎంపిక చేస్తామని, దరఖాస్తుదారులు దళారీలను ఆశ్రయించి మోసపోవద్దని, ఎవ్వరికీ డబ్బులు ఇవ్వొద్దని సూచించారు.

దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు

రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ జగిత్యాల రూరల్, అర్బన్, మల్లాపూర్, మల్యాల ఇబ్రహీంపట్నంలో ఆయా మండలాల ఎంపీడీవోలు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అధికారులు ఒరిజినల్ పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ బ్యాంకు అధికారులు, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

సోమేశ్వర కొండపై భక్తుల సందడి


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ కనక సోమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. మల్లాపూర్‌కు చెందిన కొప్పెల కృష్ణరెడ్డి-వనిత దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు బల్యాపెల్లి ప్రభాకర్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, సభ్యులు పాల్గొన్నారు.

► ఎరువుల వాడకం తగ్గించాలి

ధర్మపురి: పంటల సాగులో రైతులు ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రత్నాకర్, శోభారాణి అన్నారు. మండలంలోని ఆరెపెల్లిలో సోమవారం రైతుల వద్దకే శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, విత్తనాలకు రశీదులు తీసుకోవాలని, యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. ఏవో రాజ్‌కుమార్, ఏఈవో సాయిప్రియ తదితరులున్నారు.

► దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ సంస్కృతం(1),తెలుగు(2),మ్యాథ్స్(1),బయాలజీ(1), సోషల్(1),టీజీటీ మ్యాథ్స్(1),సోషల్(1),జేఎల్ మ్యాథ్స్(1),ఫిజిక్స్(1),కెమిస్ట్రీ(1),బోటనీ(1) జూలోజీ(1) సబ్జెక్టులకు అతిథి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు బీఈడీ పీజీలో కనీసం 55 శాతం మార్కులతో పాటు అనుభవం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. దరఖాస్తులు ఈ నెల 31 వరకు స్వీకరిస్తామని, ఇంటర్వ్యూ,డెమో జూన్ 2 న ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9866559700 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

► బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా భగవాన్ యాదవ్

వెల్గటూర్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎండపల్లి మండలం అంబరిపేట గ్రామానికి చెందిన ఎలుక భగవాన్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మీనారాయణ భగవాన్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో తనకు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులకు భగవాన్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని తెలిపారు.

► పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

జగిత్యాల క్రైం:జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి కృష్ణానగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సోమవారం సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రూ.12,750తోపాటు ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టణ పోలీసులకు అప్పగించామన్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు అఫ్రోజ్, కమలాకర్, ఖాసీం పాల్గొన్నారు.

► అన్నదానం కోసం విరాళం

మల్యాల: మండలంలోని కొండగట్టు ఆలయంలో అన్నదానం కోసం హైదరాబాద్‌కు చెందిన బల్మూరి షిరియా రూ.25 వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని అనంతరం ఆలయ అధికారి రాజేందర్ రెడ్డికి విరాళం అందజేశారు.

వర్షంతో మొలకెత్తిన ధాన్యం


మొలకెత్తిన ధాన్యం చూపిస్తున్న రైతు

రాయికల్: మండలంలో రెండు రోజులు క్రితం కురిసిన వర్షంతో కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం మొలకెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే కురిసిన వర్షంతో ధాన్యం మొలకెత్తడంతో కొనుగోలు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మొలికెత్తిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


దరఖాస్తులు సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: ప్రభుత్వ పథకాలు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు వైద్యుల అంజన్‌కుమార్ సూచించారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నాయకుడు, కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్ష పదవికి 12 మంది, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి 9 మంది దరఖాస్తు చేసుకున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, సీనియర్ నాయకులు చెదలు సత్యనారాయణ, తొట్ల అంజయ్య, కల్లెడ గంగాధర్, హరిప్రసాద్, కూన అశోక్, రాధాకృష్ణ, ఎండీ రేహన్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు

కథలాపూర్:మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెదలు సత్యనారాయణ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్ష పదవికి సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కథలాపూర్‌కు వచ్చిన కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు అంజన్‌కుమార్‌కు మండల నాయకులతో కలిసి దరఖాస్తు ఇచ్చారు.

అధ్యక్ష పదవికి రాజేందర్ రెడ్డి దరఖాస్తు

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బద్దం రాజేందర్ రెడ్డి మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 15 ఏళ్లుగా అధ్యక్ష పదవి ఆశిస్తున్న రాజేందర్ రెడ్డి 2023లో కూడా అధ్యక్ష పదవికి పోటీ పడినప్పటికీ అప్పుడు సామాజిక సమీకరణాలతో అదిష్టానం పక్కన పెట్టింది.

అర్హులందరికీ రుణాలు అందించాలి

ఇబ్రహీంపట్నం: అర్హులైన అందరికీ రాజీవ్ యువ వికాస్ రుణాలు అందించాలని బీజేపీ నాయకుడు గుజ్జె గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని వేములకుర్తిలో మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టి దరఖాస్తుదారులను ఇబ్బంది పెడుతుందన్నారు. పైరవీలకు తావు లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతీ అందరికీ లబ్ధి చేకూర్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మాలేపు శ్రీనివాస్, శక్తికేంద్ర ఇన్‌చార్జి వెంకటస్వామి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడపెల్లి గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పిల్లల్లో మానసిక వికాసం ఎదిగేలా చూడాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీవో

జగిత్యాల: పిల్లల్లో మానసిక వికాసం ఎదిగేలా చూడాలని ఆర్డీవో మదుసూదన్ అన్నారు. సోమవారం బ్రైట్ మైన్స్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు మొబైల్ అలవాటు కారణంగా వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, బాల్యాన్ని దారి మళ్లిస్తున్న ఆధునిక జీవన శైలి అన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, రోటరి క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, శ్రీనివాస్, డాక్టర్ మోహన్‌రెడ్డి, రమణరెడ్డి, నరేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



వెల్గటూర్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్ధన్ ఆధ్వర్యంలో వెల్గటూర్‌లో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కోటిలింగాల కమాన్ నుంచి ర్యాలీగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు అంబేడ్కర్ చౌరస్తా అమర జవాన్లకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సంగ వెంకటగిరి, జీవన్‌రావు, ముడిమడుగుల భూమయ్య, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలలు వచ్చే నెల 12 నుంచి ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించేందుకు సోమవారం ఎమ్మార్సీకి పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలంలోని 31 పాఠశాలలు ఉండగా, విద్యార్థులకు 13,506 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో మధు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రవీందర్, శివరాం, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్, ఎంఐఎస్ కార్తీక్ పాల్గొన్నారు.

చెరువులో పడి పాడి గేదె మృతి

పెగడపల్లి: మండల కేంద్రంలోని యాపల్ చెరువులో పాడి గేదె మృతి చెందిన సంఘటన పెగడపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు గరిగె సంజీవ్ పాడి గేదె చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. పాడి గేదె సుమారు రూ.80వేల విలువైన గేదె మృతిచెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గంగాధర్

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ. 10వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇంకా చెల్లించలేదని, వెంటనే రూ. 10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నవంబర్ నుంచి కోడిగుడ్ల బిల్లులు, ఫిబ్రవరి నెల నుంచి వేతనాలు ఇప్పటివరకు చెల్లించలేదని పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా బిల్లులు వేతనాలు చెల్లించాలని లేకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షురాలిగా బైరీ రాజగంగు, కార్యదర్శిగా న్యాత ప్రమీలను ఎన్నుకున్నారు.

గురుకులం పూర్వ విద్యార్థులకు ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ



జగిత్యాల: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పూర్వ విద్యార్థులకు ఉచిత నైపుణ్య వృత్తి శిక్షణ ఇవ్వనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2017 నుంచి ఇప్పటి వరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత విద్య అభ్యసించలేని స్థితిలో ఉన్న నిరుద్యోగులకు వృత్తి రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. గురుకుల విద్య సంస్థ, ఉన్నత ఫౌండేషన్ సహకారంతో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతిరోజు పాఠశాల, కళాశాలల్లో శిక్షణ ఇస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.